సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం ׀ 22 ׀ డిసెంబర్ ׀ 2024



బోటు షికారు లేదాయె..

చెరువుల్లో నీరు నిండుగా ఉన్నా బోటు షికారు కరువైంది. ఉన్నవి కూడా నిత్యం మరమ్మతులకు గురికావడంతో పర్యాటకుల సంఖ్య తగ్గిపోతోంది.

-8లో



రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

పంటల సాగులో రైతులకు తగిన సలహాలను ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని వ్యవసాయ అధికారులు నాగేశ్వరరావు, చంద్రనాయక్ సూచించారు.

-8లో

గరిష్టం/కనిష్టం
29.0/17.4

వాతావరణం

జిల్లాలో శనివారం 17.4 - 29.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సమగ్రశిక్ష ఏపీసీగా నిత్యానందరాజు

కడప ఎడ్యుకేషన్: జిల్లా సమగ్రశిక్ష అడిషినల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌గా కర్నూల్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ నిత్యానందరాజును నియమిస్తూ విద్యాశాఖ సెక్రటరీ కోన శశిధర్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో ఫారిన్ సర్వీస్ కింద కడప సమగ్రశిక్ష అడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా వచ్చిన ప్రభాకర్‌రెడ్డి తన పద వీకాల గడువు ముగియడంతో ఆయన తిరిగి మాతృసంస్థకు వెళ్లిపోయారు. కాగా నిత్యానందరాజు సోమవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

'ఈ–ఆఫీస్' పక్కాగా అమలు కావాలి

కడప సెవెన్‌రోడ్స్: ఈ నెల 26వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ–ఆఫీస్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఇన్ఫర్మేషన్ అధికారి డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల జెడ్పీ అధికారులు, ఎంపీడీఓలు, టైపిస్టులు, సిబ్బందికి ఈ–ఆఫీస్ నిర్వహణపై ఎన్ఐసీ ఆధ్వర్యంలో శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే ఈ–ఆఫీస్ సిస్టమ్ ఆచరణలో ఉండగా.. దీన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.

'ఓపెన్ టెన్త్' ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల పరీక్ష రుసుం చెల్లింపునకు 2025 జనవరి 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ మీనాక్షి, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ సాంబశివారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పరీక్షా రుసుము చెల్లించే అభ్యాసకులు ఏదైనా ఏపీ ఆన్‌లైన్ కేంద్రంలో గానీ.. ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా నేరుగా పరీక్ష రుసుం చెల్లించవచ్చని తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించిన అభ్యాసకుల వివరాలతో కూడిన నామినల్ రోల్స్ జాబితాను ఏ1 సమన్వయకర్తలు 2025 జనవరి 11న డీఈఓ కార్యాలయంలో అందజేయాలని డీఈఓ మీనాక్షి, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ సాంబశివారెడ్డి తెలిపారు.

నేడు పురస్కార ప్రదాన సభ

కడప కల్చరల్: ప్రముఖ కథ, నవలా రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డికి సుప్రసిద్ధ కథకులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సార్థక జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, బోయపాటి దుర్గాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కథా రచయిత ఎస్.దాదా హయాత్ అధ్యక్షత వహిస్తారని, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, అడిషనల్ ఎస్పీ ప్రకాశ్‌బాబు విశిష్ట అతిథిగా హాజరవుతారన్నారు. గౌరవ అతిథులుగా ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, బొల్లు కృష్ణమూర్తి పాల్గొంటారన్నారు. సుప్రసిద్ధ సాహితీ విమర్శకులు ఆచార్య మేడిపల్లి రవికుమార్ సన్నపురెడ్డి సాహిత్యం గురించి ప్రముఖ రచయిత్రి ఆర్.శశికళ, కేతు విశ్వనాథరెడ్డి గురించి మాట్లాడనున్నారని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: ప్రైమరీ హెల్త్ సెంటర్స్‌లో వివిధ కేటగిరీలకు సంబంధించిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఫిజీషియన్, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2, ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీ, శానిటరీ అటెండర్ కమ్ వాచ్‌మెన్, ఫార్మాసిస్ట్, టీబీ హెల్త్ విజిటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కడప. ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు. దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో స్వయంగా అందజేయాలని పేర్కొన్నారు.

శిక్షణ



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ

కడప అర్బన్: జిల్లాలో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు ప్రాథమిక అర్హత పొందిన హోంగార్డులకు, ఉత్సాహవంతులైన అభ్యర్థులకు ప్రతి రోజూ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ట్రాఫిక్ సీఐ జావేద్ ఉచితంగా శిక్షణను ఇస్తున్నారు. ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అప్రమత్తంగా ఉండాల్సిన విషయాలపై ఆయన పలు సూచనలు చేస్తుండడం విశేషం.

ఘనంగా జననేత జన్మదిన వేడుకలు



పులివెందులలో పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి తదితరులు



ప్రొద్దుటూరులోని విశ్వప్రేమ వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



కడపలో పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: జననేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం జిల్లాలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి వైఎస్ జగన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

- కడప నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు, దుప్పట్లు, పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రహీమ్ ఆధ్వర్యంలో వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, అన్నదానం చేశారు.
- పులివెందుల పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మున్సిపల్ కార్మికులకు, వికలాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరయ్యారు.
- ప్రొద్దుటూరు పట్టణంలోని విశ్వప్రేమ వృద్ధాశ్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కేక్ కట్ చేసి, వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి వారి మధ్య కేక్ కటింగ్ నిర్వహించారు. రామేశ్వరంలోని మూలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు

- బద్వేలులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే దాసరి సుధ ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షాలోం అనాథ శరణాలయంలో పిల్లల నడుమ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గోపవరం మండలంలోని పీపీ కుంటలో నిర్వహించిన వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పాల్గొన్నారు.
- మైదుకూరులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో బస్టాండు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారు ఇ. తిరుపాల్‌రెడ్డి, ఆర్టీజీ మాజీ జోనల్ చైర్మెన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.
- కమలాపురంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఛాత్రాలయంలోని విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పార్టీ కార్యాలయంలో సంబటూరు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.
- జమ్మలమడుగు నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డా. సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు.



జమ్మలమడుగులో రక్తదానం చేస్తున్న వైఎస్ జగన్ అభిమాని, చిత్రంలో ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



మైదుకూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తదితరులు



గోపవరం ... పి.పి.కుంటలో భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



కమలాపురంలో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నరేన్ రామాంజుల రెడ్డి

ఓవరాల్ చాంపియన్ 'కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్'



ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచిన కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజనల్ మీట్–2024–25 ఘనంగా ముగిశాయి. ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన ఈ పోటీలలో ఉమ్మడి కడపజిల్లాలోని 14 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, బ్యాడ్మింటన్, పరుగుపందెం, ఖో ఖోలను నిర్వహించారు. ఈ పోటీలలో ఇండ్యూజువల్ చాంపియన్స్‌గా పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతోపాటు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిలిచారు. దీంతోపాటు ఓవరాల్ చాంపియన్స్‌గా కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థినిలకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరం అన్నారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతితో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బందితోపాటు ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

జనవరి 29 నుంచి దేవునికడప బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా 29వ తేది ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణంతో కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి చంద్రప్రభ వాహనం, 30న సూర్యప్రభవాహనం, పెద్దశేష వాహనం, 31న చిన్నశేష, సింహ వాహనం, ఫిబ్రవరి 1న కల్పవృక్ష, హనుమంత వాహనం, 2న ముత్యపుపందిరి, గరుడ వాహనం, 3న ఉదయం కల్యాణోత్సవం ఉంటుందని తెలిపారు. 4న ఉదయం రథోత్సవం, అనంతరం ధూళి ఉత్సవం, 5న సర్వభూపాల, అశ్వ వాహనం, 6న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం ధ్వజావరోహణం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు వివరించారు.

రాష్ట్రంలో డిక్టేటర్ పాలన

- ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడితే కేసులు నమోదు చేస్తున్నారు
- కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింది
- మీడియాతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్రంలో డిక్టేటర్ పాలన నడుస్తోందని, ప్రభుత్వ వైఫల్యాల గురించి మాట్లాడితే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదు చేస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గాలికి వదిలేసిందని మండిపడ్డారు. పథకాలను అడిగిన వారిపై కక్ష సాధింపు చర్యలు చేపడుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 2027లో ఎన్నికలు వచ్చినా, 2029లో వచ్చినా వాటిని ఎదుర్కొనేందుకు వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను జగనన్న ప్రవేశపెట్టి అర్హులందరికీ అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం వైపు పదిపదమంటూ..!

పిల్లల బంగారు భవితకు 'పది' పునాది.. ఉన్నత శిఖరాల అధిరోహణకు తొలి అడుగది. అవును.. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సాధించాల్సిన లక్ష్యాల కోసం 'పది'పదమంటూ విద్యార్థులను పరుగులు పెట్టిస్తున్నారు అధికారులు. ఈ సారి వందశాతం ఉత్తీర్ణత సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసి పాఠశాలల్లో అమలుకు శ్రీకారం చుట్టారు. దీంతోపాటు చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు


- పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు వంద రోజుల ప్రణాళిక
- విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో డిసెంబర్ నెల నుంచి మార్చి వరకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఆయా సబ్జెక్టుల టీచర్లు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. 2025 సంవత్సరం మార్చి 17 నుంచి మార్చి 31 వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూలును రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇటీవల విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 593 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 27,833 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. గతంలో వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకుని, మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. సబ్జెక్టు వారీగా విద్యార్థులకు అసైన్‌మెంట్స్ నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు వారికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చేలా ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు.

అదనపు తరగతుల నిర్వహణ..

వంద రోజుల ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. ఆ మరుసటి రోజు ముందు రోజు చదివిన సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష నిర్వహించి వారి ప్రతిభను అంచనా వేస్తున్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న వారు ఎలా చదువుతున్నారు, ఏ సబ్జెక్టుల్లో వెనుబడి ఉన్నారని గమనిస్తూ వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేలా కృషి చేస్తున్నారు.


స్టడీ అవర్స్‌తో ఎంతో ఉపయోగం



ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్‌ను నిర్వహించడం వల్ల చాలా ఉపయోగంగా ఉంది. రివిజన్ తో బాగా గుర్తుండి పోతుంది.

– సాయి ప్రణీత, పదవ తరగతి విద్యార్థి

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం రూపొందించాం. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– లెక్కల జమాల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, ఒంటిమిట్ట

పకడ్బందీగా ప్రణాళిక అమలు




జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఉపాధ్యాయులు విద్యార్థులు ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో పరిశీలిస్తున్నారు. ఉపాధ్యాయులకు మేము తగిన సూచనలు, సలహాలను ఇస్తున్నాం. అందరి సమిష్టి కృషితో మంచి ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి

ఫిజికల్ టెస్ట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు



కానిస్టేబుల్ అభ్యర్థుల శారీరక సామర్థ్య పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్: కానిస్టేబుల్ అభ్యర్థుల శారీరక సామర్థ్య పరీక్షల ఏర్పాట్లను ఇన్‌చార్జ్ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డి.టి.సి) మైదానంలో కలియతిరిగారు. అక్కడ చేపట్టాల్సిన పనులపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలక్ట్రిసిటీ, ఇంటర్‌నెట్, ఆహారం, నీటి సౌకర్యం, టాయిలెట్‌లు, వైద్యం వంటి వసతుల ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. 1600 మీటర్లు, లాంగ్‌జంప్, 100 మీటర్ల పరుగుపందెం నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన ఉమ్మడి కడప జిల్లా అభ్యర్థులకు 2024 డిసెంబర్ 30వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 01వ తేదీ వరకు పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు (పీఎంటీ/పీఈటీ) శారీరక దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలు జరుగనున్నాయని ఎస్పీ తెలిపారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, అదనపు ఎస్పీ (ఏఆర్) బి. రమణయ్య, డి.టి.సి ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, రిమ్స్ పిఎస్ సీఐ సీతారామిరెడ్డి, ఆర్ఐలు ఆనంద్, శివరాముడు, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం



విద్యార్థి హిమవంతు

జమ్మలమడుగు : మైలవరం మండలం దొమ్మర నంద్యాల గ్రామానికి చెందిన ఒగ్గు హిమవంతు అనే విద్యార్థి కనిపించడం లేదని తండ్రి ఒగ్గు మురళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జమ్మలమడుగు పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న జ్యోతిరావు పూలే హాస్టల్‌లో పదవ తరగతి చదువుతున్నాడన్నారు. ఈనెల 19వతేదీ నుంచి కనిపించడం లేదంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని అమృతానగర్‌కు చెందిన కురవ నరేష్‌కుమార్ (42) అనే ఆటో డ్రైవర్ అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నరేష్‌కుమార్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. అతనికి భార్య గౌరీ, బీటెక్ చదివే కుమారుడు ఉన్నారు. ఇటీవల అతను అధికంగా అప్పులు చేసి మద్యానికి బానిసయ్యాడు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికమవ్వడంతో ఇంట్లోని రేకుల పైపునకు చీర చుట్టుకొని శనివారం ఉదయం ఉరేసుకున్నాడు. భార్య గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

పంట పొలాల్లో కొండ చిలువ



కొండ చిలువను చంపి పడేసిన దృశ్యం

చాపాడు : మండల పరిధిలోని సీతారామాపురం పంట పొలాల్లో శనివారం కొండ చిలువ కలకలం సృష్టించింది. శనివారం ఉదయం రైతులు పొలాల వద్దకు వెళ్లగా కొండ చిలువ వారి కంట పడింది. ఈ కొండ చిలువ వలన ప్రమాదమని భావించిన రైతులు దానిని చంపేశారు. ఈ కొండ చిలువను రోడ్డు పక్కన పడేయడంతో దారిలో వెళ్లే వారు దీన్ని చూసి ఇంత కొండ చిలువ పంట పొలాల్లో తిరుగుతోందా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో తిరుగుతున్న కొండ చిలువను రైతులు చంపేశారు.

బోటు షికారు లేదాయె.. బోలెడన్ని సమస్యలాయె.!

- నీళ్లున్నా.. నిధులు, బోట్లు కరువు
- నీరసించిన బోటు షికారు
- యూనిట్లు ఎక్కువ.. వసతులు తక్కువ



షికారుకు సిద్ధంగా దేవుని కడప చెరువులోని బోటు

కడప కల్చరల్ : లాహిరి లాహిరి లాహిరిలో ... అంటూ, అలా అలా చెరువు నీళ్లలో షికారు చేయాలని అందరికీ ఆశ ఉంటుంది. గమ్మత్తైన ఆ అనుభూతి కోసం అంతో ఇంతో ఖర్చు చేసేందుకు కూడా ప్రజలు వెనుకాడరు. కానీ సమీపంలోని చెరువుల్లో నీరు నిండుగా ఉన్నా బోట్లు అందుబాటులో లేకపోవడం, ఉన్నవి కూడా నిత్యం మరమ్మతులకు గురికావడంతో పర్యాటకుల సంఖ్య నానాటికి తగ్గిపోతోంది. ఫలితంగా ఈ రంగానికి అనువుగా ఉన్నచోట కూడా ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది.

ఉన్న బోటింగ్ యూనిట్లు మూసివేయాల్సిన పరిస్థితి

జిల్లాలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని బోటింగ్ యూనిట్లు నానాటికి తీసి కట్టు అన్నట్లు మారుతున్నాయి. ఒక్కసారి పెట్టుబడికి సంవత్సరాల తరబడి ఆదాయం అందించే అవకాశం ఉంది. కానీ సౌకర్యాలు లేక ఉన్న బోట్లు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో పనికిరాకుండా పోతున్నాయి. మంచి ఆదాయాన్ని చేకూర్చిపెట్టే బోటింగ్ యూనిట్లు నానాటికి నష్టాలనే మిగిలిస్తున్నాయి

దేవుని కడప చెరువు యూనిట్

దేవుని కడప చెరువులోని బోటింగ్ యూనిట్ కేవలం ఒక్క బోటుతోనే కొనసాగుతోంది. అది కూడా తరచూ మరమ్మతులకు గురవుతోంది. టిక్కెట్ ధర రూ. 100 కావడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. ఎక్కువ మంది సభ్యులుగల కుటుంబం ఒకేసారి ఎక్కేందుకు అవకాశం లేకపోవడం కూడా ప్రజలను నిరాశకు గురి చేస్తోంది. నిజానికి ఇక్కడ పెట్రోలు బోట్ల కంటే పెడలింగ్ బోట్లు కనీసం రెండైనా అవసరం. కానీ ఆ సౌకర్యాలేవీ లేకపోవడంతో ఇది నగరంలోనే అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్నా కలెక్షన్లు పూర్తిగా తగ్గిపోయి దాదాపు మూసివేసే స్థితికి చేరింది.

ఒంటిమిట్ట

ఒంటిమిట్ట చెరువులో బోటింగ్ యూనిట్ ఏర్పాటు చేశారు. టికెట్ల విక్రయాల కోసం కౌంటర్‌ను కూడా నిర్మించారు. కానీ అప్పడప్పుడు (బ్రహ్మోత్సవాల సందర్భంగా) ఒకటి, రెండు బోట్లు తెప్పించి మమ అనిపిస్తున్నారు. ఆ తర్వాత షరామామూలుగా మూసి వేస్తున్నారు. రెండు, మూడేళ్లుగా ఈ యూనిట్ బ్రహ్మోత్సవాల సమయంలో కూడా మూసివేసే ఉంది.

మైలవరం...ప్రత్యేకం

ఈ యూనిట్‌కు అంటూ ప్రత్యేకంగా ఒక్క బోటు కూడా లేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న స్థానికులైన ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా బోట్లు నిర్వహించుకుంటూ అక్రమంగా ఆదాయం గడిస్తున్నారు. ఏళ్ల తరబడి ఇక్కడ ఇదే పరిస్థితి ఉందని సమాచారం. వ్యతిరేకుల ఫిర్యాదుతో అక్రమంగా తిరుగుతున్న బోటుని ఇటీవల అధికారులు సీజ్ చేశారు. కొన్ని రోజుల తర్వాత ఆ బోటులోని ఇంజిన్ చోరీకి గురైంది. అక్కడ సీసీ కెమెరాలు, వాచ్‌మెన్ కూడా ఉండగా బోటు ఇంజిన్ ఎలా చోరీకి గురయిందో దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అన్నీ అరకొరగా..



పార్నపల్లెలోని యూనిట్‌లోని ఓ బోటు

జిల్లాలో మొత్తం ఐదు బోటింగ్ యూనిట్లు ఉన్నాయి. ఇందులో పార్నపల్లె యూనిట్ మూడు బోట్లతో ఓ మోస్తరుగా ఉండగా, కడప నగరంలోని దేవుని(పాత)కడప యూనిట్ కేవలం ఒకే ఒక బోటుతో ఉంది. నాలుగు సీట్లు గల ఈ బోటులో ఒక్కొక్క టికెట్టు ధర రూ. 100 రూపాయలు. దీంతో ధర ఎక్కువ అని, కేవలం నాలుగు సీట్లు ఉన్నాయని, అంత కుమించిన కుటుంబ సభ్యులు వెళ్లే అవకాశం లేదంటూ వచ్చిన వారు కూడా తిరిగి వెళ్లిపోతున్నారు. ఉన్న ఒక్క బోటు కూడా తరచూ మరమ్మతులకు గురై అందుబాటులో లేకపోవడంతో పర్యాటకుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోయింది. ఫలితంగా ఈ యూనిట్ ఎక్కువ రోజులు మూసి ఉంచాల్సి వస్తోంది. పార్నపల్లె బోటింగ్ యూనిట్లో ఆరు సీట్లు గల స్పీడ్ బోటు ఒకటి. 24 సీట్లు గల డీలక్స్ బోటు ఒకటి, 12 సీట్లుగల పాంటూన్ బోటు ఒకటి అందుబాటులో ఉన్నాయి. స్పీడ్ బోటులో టిక్కెట్ ధర రూ. 100, ప్యాంటూన్ బోటులో రూ. 75, డీలక్స్ బోటులో రూ. 50 లుగా సాగుతోంది.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం

– రాష్ట్ర పాస్టర్ల సంఘం నేతలు

కడప కల్చరల్ : పాస్టర్లందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే క్రైస్తవుల సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చని రాష్ట్ర పాస్టర్ల సంఘం నేతలు అభిప్రాయపడ్డారు. స్థానిక కృపాకాలనీలోని న్యూ నేటివ్ మినిస్ట్రీస్ మందిరంలో శనివారం పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పల్నాడు జిల్లాకు చెందిన రెవరెండ్ లాజర్ మాట్లాడుతూ క్రైస్తవులకు హింసలు ఎదుర్కోవడం కొత్తేమీ కాదని, దైవ కార్యక్రమాలను ఆటంక పరిచిన వారిని ఆయనే శిక్షిస్తాడన్నారు. సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ రెవరెండ్ శేషం ప్రసాద్, యూపీఏ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ మందిరాలు, పాస్టర్లు, క్రైస్తవులపై దాడులు చేయడం, కార్యకలాపాలను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. స్థానిక బుడగజంగం పెద్దలు కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్, రాష్ట్ర సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు డి.వి ప్రసాద్, మోషే, మానవ హక్కుల సంఘం ప్రతినిధి పి.రవితేజ పాల్గొన్నారు.



సమావేశమైన క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : పంటల సాగులో రైతులకు తగిన సూచనలు, సలహాలను ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ అధికారులతోపాటు ఏడీఏలు కృషి చేయాలని కడప, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ అధికారులు అయితా నాగేశ్వరరావు, చంద్రనాయక్ సూచించారు. శనివారం కడప ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన ఏడీఏలకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు రెండు జిల్లాల్లోని ఆయా డివిజన్ల వారీగా సాగైన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ డివిజన్ల వారిగా వ్యవసాయ అధికారులతో పాటు మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలను ఇవ్వాలన్నారు. సీజన్ వారిగా పంటలసాగు విషయంలో రైతులకు తగిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. అలాగే మండలాలు, డివిజన్ల పరిధిలో ఎరువులు, పురుగు మందుల ధరల నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేవీకే, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్లు డాక్టర్ వీరయ్య, డాక్టర్ అంకయ్యకుమార్‌లు మాట్లాడుతూ పంటలకు ఆశించిన చీడపీడలకు సంబంధించి శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను రైతులకు అందించాలన్నారు. ఆత్మ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు పంటల సాగుతోపాటు వారి ఆర్థిక అభివృద్ధికి ఏడీఏలతోపాటు శాస్త్రవేత్తలు తగిన కృషి చేయాలన్నారు. కేవీకే, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, మాధురి, మానస, భాగవత ప్రియతో పాటు కలికిరి కేవీకే శాస్త్రవేత్త పీరుసాహెబ్‌లు శనగ, మినుము, ఉలవ, వరి, వేరుశనగ, బొప్పాయి, మామిడి, అరటి పంటలను ఆశించే చీడపీడల నివారణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల ఏడీఏలు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి ధీరత్వాన్ని చిత్రించిన తవ్వా



ఓ ధీరుడి పయనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవితాన్ని 'ఓ ధీరుడి పయనం' పేరుతో పుస్తకం రాసిన రచయిత తవ్వా వెంకటయ్య.. జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన ధీరత్వాన్ని చిత్రించాడని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మైదుకూరులో శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య రాసిన 'ఓ ధీరుడి పయనం' పుస్తకాన్ని రఘురామిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాట పట్టింపుతో పార్టీని స్థాపించిన వాడు, పోరాటాలతో పార్టీని నడిపిన వాడు, ప్రజాభిష్టంతో పార్టీని గెలిపించినవాడు, ప్రజల కోసం పాలించిన వాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ పుస్తకం జగన్ మోహన్‌రెడ్డి జీవితానికి అద్దం పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వ మాజీ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మైదుకూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, చాపాడు, దువ్వూరు బి.మఠం ఎంపీపీలు లక్ష్మయ్య, జయచంద్రారెడ్డి, వీరనారాయణరెడ్డి, మైదుకూరు వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారుల నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కొంతమంది ఆర్టీసీ అధికారుల నిర్ణయాలు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నాయని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు అన్నారు. శనివారం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఈయూ జిల్లా అధ్యక్షుడు సుభాష్ బాబు(బోస్) అధ్యక్షతన కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యదర్శి ఏ.రామూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2019లో సాధించుకున్న సర్క్యులర్ 01/2019 ను గత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు జిల్లాలలోని ఆర్టీసీ అధికారులు పక్కన పెట్టారన్నారు. రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ జోక్యం చేసుకోవడంతో గత నెల 29న విజయవాడలో ఆర్టీసీ హౌస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉన్నతాధికారుల సమావేశంలో సర్క్యులర్‌ను యథాతథంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కొంతమంది కింది స్థాయి అధికారులు ఈ సర్క్యులర్ అమలు చేయకుండా అక్రమంగా చార్జిషీట్లు ఇస్తూ, డ్యామేజ్ కాస్ట్‌లను రికవరీ చేస్తూ, సస్పెండ్లు, రిమూవల్స్ చేస్తూ సమస్యలు సృష్టించడం దారుణమన్నారు. ఇలాంటి అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మాట్లాడుతూ సర్వీసులో ఉన్న ఉద్యోగులకు, రిటైర్డ్ అయ్యే వారికి విలీనానికి ముందున్న పద్దతుల్లోనే ఆర్ మెడికల్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కడప జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కె.కుమార్, ఎస్.రాజశేఖర్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులలో 58 సంవత్సరాలు దాటిన తరువాత పెన్షన్ కోసం 10–డి ఫారం ద్వారా దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో కడప జిల్లా కార్యదర్శి ఏ.రామమూర్తి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సి.ఆనందబాబు, కడప జిల్లా గౌరవాధ్యక్షుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, కడప నాన్ ఆపరేషన్ రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.రామాంజనేయులు, ఎస్.అంకిరెడ్డి పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తు నిర్మాణానికి వేదిక విశ్వవిద్యాలయం

వైవీయూ ఇండక్షన్ ప్రోగ్రాంలో వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి



వేమన చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ, అతిథులు

వైవీయూ : కన్నవారి ఆకాంక్షలను నెరవేర్చి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకునేందుకు విద్యార్థులకు యోగివేమన విశ్వవిద్యాలయం చక్కటి జ్ఞాన కేంద్రం అని విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం వైవీయూలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఫ్యాకల్టీ, విలువైన పుస్తక నిధి కలిగిన లైబ్రరీ విశ్వవిద్యాలయంలో ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ దేశంలోని అత్యున్నత విశ్వవిద్యాలయంల్లో వైవీయూ ఒకటన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పీజీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ గొప్ప స్థాయిల్లో ఉన్నవారంతా రోజుకు 18 గంటలు శ్రమించినవారేనని గుర్తుచేస్తూ వారిని అనుసరించాలన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ ప్రసంగిస్తూ గురువు మందలిస్తున్నాడంటే మిమ్ములను ఉన్నతంగా మలుస్తున్నాడని భావించాలన్నారు. చిన్మయ మిషన్ అధ్యక్షుడు స్వామి తురియానంద మాట్లాడుతూ మైండ్ మేనేజ్‌మెంట్ తెలిసిన వారే ముందుంటారన్నారు. స్వామి వివేకానంద చికాగో ఉపన్యాసం గుర్తుచేస్తూ ఆయన మార్గం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. తైక్వాండో శిక్షణా నిపుణులు మాస్టర్ ఎం.నాగూర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు దీపం లాంటివారు ఇతరులకు వెలుగులు ఇవ్వాలని కోరారు. వ్యాయామ క్రీడల శాస్త్ర సంచాలకులు డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి సభా సమన్వయం చేశారు. సాంస్కృతిక విభాగం సంచాలకులు ఆచా ర్య జి. విజయభారతి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై శనివారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ కింద రాష్ట్ర వ్యాప్తంగా రూ. 2100 కోట్ల బకాయిలు, వసతి దీవెన కింద రూ. 1480 కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. ప్రతి యేటా విద్యార్థులకు నాలుగు క్వార్టర్లలో డబ్బులు జమ అయ్యేవన్నారు. గత ఏడాది ఒక క్వార్టర్ మాత్రమే విడుదలైందని, మిగతా మూడు క్వార్టర్లు విడుదల కావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో సుమారు 9.5 లక్షల మందికి రీఎంబర్స్‌మెంట్ నిధులు అందాల్సి ఉందన్నారు. కానీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రీఎంబర్స్‌మెంట్ మొత్తాలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు కోర్సులు ముగిసినప్పటికీ కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే జీఓ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తింపజేస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, సహాయ కార్యదర్శి అరుణ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు అభిరామనంద న్, తేజ తదితరులు పాల్గొన్నారు.

నేడు మస్తాన్ స్వామి నూతన దర్గా ప్రారంభం



విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న మస్తాన్ స్వామి దర్గా

పెండ్లిమర్రి : భక్తుల కోర్కెలు తీర్చే మస్తాన్‌స్వామి నూతన దర్గా ఆదివారం ప్రారంభోత్సవం, అనంతరం ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. కొండూరు గ్రామంలో దాదాపు శతాబ్దాల క్రితం మస్తాన్ స్వామి వెలిశాడని పూర్వీకుల కథనం. స్వామిని కొలిచిన వారికి కోరిన కోర్కెలు తీర్చుతాడని.. సంతానం లేనివారికి సంతానం కలిగిస్తాడని.. భూత పిశాచాలు ఉన్న వారికి అన్ని దుష్ట శక్తులను తొలగిస్తాడని భక్తుల నమ్మకం. దర్గా ప్రారంభం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం గంధము, రాత్రి స్వామి వారి ఊరేగింపు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

సహజ సామర్థ్యాలకు మరింత పదును



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రధానోపాధ్యాయుల్లో ఉండే సహజ సామర్థ్యాలకు నాయకత్వంలో మరింత పదును పెట్టేందుకే ప్రభుత్వం లీడర్ షిప్ శిక్షణను ఇస్తోందని డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి కడప నగర శివార్లలోని గీతమ్స్ కాలేజీలో ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న లీడర్ షిప్–2 శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ శిక్షణను ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రెనింగ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణలో జిల్లా వ్యాప్తంగా 562 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశంలో డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు సమర్థవంతంగా నిర్వహించాలంటే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా దృఢమైన నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలన్నారు. తద్వారా పాఠశాల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు వారే సత్వరం పరిష్కరించుకోగలరన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు వెంకటరామిరెడ్డి, విజయరెడ్డి, దశరథరామిరెడ్డి, కేశవరెడ్డి, రామాంజనేయరెడ్డి, విశ్వనాథరెడ్డి, మాస్టర్ ఫెసిలిటేటర్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ పుష్పగిరి సందర్శన



ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ శాస్త్రికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

వల్లూరు : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ శాస్త్రి శనివారం సందర్శించారు. మొదట ఆయన పుష్పగిరి కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయాన్ని సందర్శించారు. శ్రీ చెన్న కేశవ స్వామి, శ్రీ సంతాన మల్లేశ్వర స్వామి, లక్ష్మీ దేవి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు ఆలయ చరిత్రను, విశిష్టతను వివరించారు. అనంతరం ఆయన రుద్ర పాద ఆలయాన్ని, పవిత్ర పినాకినీ నదిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్య నాథేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రీ చక్ర సహిత కామాక్షీ మాతను, శ్రీ వైద్యనాథ స్వామి, త్రికుటేశ్వర, భీమ లింగేశ్వర, భీమేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు.

నేటి నుంచి ఈశ్వరీదేవి మఠంలో ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఈశ్వరీదేవి

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం సమీపంలో ఉన్న మాతా ఈశ్వరీదేవి మఠంలో ఆదివారం నుంచి 27వ తేదీ వరకు ఈశ్వరీదేవి అమ్మవారి ఆరాధన ఉత్సవాలకు సర్వ సిద్ధం చేశారు. ఈమేరకు మఠం ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్రహ్మంగారి కుమారుడు గోవిందస్వామి, గిరియబం దంపతులకు జన్మించిన ఈశ్వరీదేవి 1789లో బ్రహ్మంగారిమఠం సమీపంలో సజీవ సమాధి నిష్ఠ వహించారు. అప్పటి నుంచి అమ్మవారి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు అమ్మవారి భక్తులు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్నాటక, తమిళనాడు నుంచి వస్తారు.